# లోలెవల్ వంతెనలు.. ప్రజలకు అవస్థలు



రాపూరు రోడ్డులో పొర్లిన కల్వర్టు వద్ద కాపలాకాస్తున్న పోలీసులు (ఫైల్)



గొట్టిమాను కోనపై నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి

చిట్వేలి : మండలంలో లోలెవల్ వంతెనలతో వర్షాకాలంలో అటు ప్రజలు, ఇటు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికి సైతం లోలెవల్ వంతెనలు, కల్వర్టులపై నీరు పారుతుండటంతో కొన్ని అంతర్ జిల్లా బస్సు సర్వీసులు ఆగిపోవడం, కొన్ని గ్రామాలు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. లో లెవల్ వంతెనలు, కల్వర్టుల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు, వాహనదారులు వేడుకుంటున్నారు. చిట్వేలి – రాపూరు రోడ్డులో ఉన్న లోలెవల్ వంతెన, చిట్వేలి – రైల్వేకోడూరు రోడ్డులోని గొట్టిమాను కోనపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి, చిట్వేలి – మైలపల్లి రోడ్డులోని లోలెవల్ వంతెన తదితర కల్వర్టులు ప్రజలను, ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నాయి. చిట్వేలి – రాపూరు ప్రధాన రహదారిలో ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని చాకిరేవుమడుగు పైన ఉన్న లోలెవల్ కల్వర్టు చిన్నపాటి వర్షానికే వర్షపు నీరు వంతెనలపై పారుతూ నెల్లూరు – అన్నమయ్య జిల్లాల మధ్య బస్సు సర్వీసులకు ఆటంకం కల్గిస్తుంది. అలాగే అనుంపల్లి గ్రామం బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. చిట్వేలి – రైల్వేకోడూరు రోడ్డులోని గొట్టిమాను కోన రిజర్వాయర్‌పై ఉన్న లోలెవల్ బ్రిడ్జి అలుగు పొర్లినప్పుడల్లా బస్సు సర్వీసులు నిలిచిపోతున్నాయి. బ్రిడ్జికి ఉన్న తూములు కొన్ని పూడిపోయి ఉండటంతో వరదనీరు బ్రిడ్జిపై పొర్లుతున్నాయి. చిట్వేలి – మైలపల్లి రోడ్డులో అలుగు ఏరుపై ఉన్న బ్రిడ్జి పొర్లినప్పుడల్లా పలు గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. దీంతో అటు ప్రజలు ఇటు ప్రయాణికులు పలు అవస్థలు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి తక్షణం లోలెవల్ వంతెనల స్థానంలో హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

## చినుకుపడితే.. ఆ రోడ్డు చెరువే!



చిన్నపాటి వర్షానికే చెరువును తలపిస్తున్న రోడ్డు

పుల్లంపేట : మండల పరిధిలోని సీతారాంపేట గ్రామంలో పాఠశాల సమీపంలో రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటంతో చినుకు పడితే చాలు మోకాళ్ల లోతు వర్షపునీరు చేరుతుంది. దీంతో ఆ రోడ్డు చెరువును తలపిస్తోంది. వాహనదారులు, పాదచారులు ఈ రోడ్డు మార్గాన వెళ్లాలంటే హడలెత్తుతున్నారు. అలాగే విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు కింద పడి గాయాలపాలవుతున్నారు. నిత్యం ఈ గ్రామానికి పలువురు వ్యాపారులు కూరగాయలు, ఆకుకూరలు, అరటిపండ్లు అమ్ముకోవడానికి వస్తుంటారు. ఈ రోడ్డు వైపు ద్విచక్రవాహనంలో వెళ్లేటప్పుడు చక్రాలు మునిగిపోయే అంత వర్షపునీరు నిల్వ ఉండటంతో కొత్తవారు ద్విచక్ర వాహనంలో అజాగ్రత్తగా వెళితే ఆసుపత్రికి వెళ్లక తప్పదంటూ గ్రామస్తులు చెబుతున్నారు. వర్షపునీరు నిల్వ ఉండటంతో దోమలు అధికం కావడంతో గ్రామ ప్రజలు జ్వరాలబారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవచూపి వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుకుంటున్నారు.

# రైతు మేధస్సును పెంచేందుకే పొలంబడి



దేగనవాండ్లపల్లెలో ఇ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దవటం : రైతు సేవా కేంద్రాలలో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు సిబ్బందికి సూచించారు. మండలంలోని లింగంపల్లి, టక్కోలు గ్రామాల్లో గురువారం పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రతి శుక్రవారం 14 వారాలపాటు విత్తనం మొదలు కోత వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంట పర్యావరణ విశ్లేషణ నిర్వహిస్తారన్నారు. మిత్ర, శత్రు పురుగుల గుర్తింపు, ప్రయోగాలు చేస్తుంటారన్నారు. పురుగుల మందుల దుష్పరిణామాలు చార్టుపై గీసి వివరించారు. నారు కొనలు తుంచి నాటడం, కాలిబాటలు, సూడోమొనాస్ వినియోగం, ప్రకృతి వ్యవసాయ విధానాలు, జిగురు పూసిన పసుపు, నీలం, తెలుపు పల్లాలు, లింగాకర్షక బుట్టలు వంటి ఉత్తమ యాజమాన్య పద్ధతులు వివరించి రైతుల పొలాల్లో అమలు పరిచి ధ్రువీకరణ చేస్తారన్నారు. తద్వారా రైతులు ఉత్పత్తులను అధిక ధరలకు అమ్ముకోవచ్చునన్నారు. పొలంబడి 30 మంది రైతులు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్వహించారు. అధ్యయన క్షేత్రం 2 ఎకరాల్లో ఉంటుందన్నారు. కావున రైతులు వారం వారం నిర్వహించే ఈ పొలం బడిలో క్రమం తప్పకుండా పాల్గొని రైతు మేధస్సును పెంచుకొని ఆర్థిక పరమైన స్వయం నిర్ణయాలను తీసుకునే విధంగా తయారు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టక్కోలు రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు, వంశీ, శివ ఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సింగరయ్య, చిన్నక్క, చంద్రకళ, భాగ్యలక్ష్మి, వరలక్ష్మి, లక్ష్మీదేవి, షారోన్, సుమల, పద్మావతి, రైతులు పాల్గొన్నారు.

**ఇ-పంట డిజిటల్ క్రాప్ బుకింగ్ పరిశీలన**

మండలంలోని టక్కోలి రైతుసేవా కేంద్రం పరిధిలోని దేగనవాండ్లపల్లె గ్రామంలో ఇ-పంట డిజిటల్ క్రాప్ బుకింగ్ ప్రక్రియను గురువారం తహసీల్దారు మురాషావలి, బద్వేల్ ఏడీఏ నాగరాజ పరిశీలించారు. సెప్టెంబర్ 15వ తేదీలోపు ఇ-పంట ప్రక్రియను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించామన్నారు. అనంతరం సామాజిక తనిఖీలు ఉంటాయని జాగ్రత్తగా చేయాలని హెచ్చరించారు.

# అధికార పార్టీ కనుసన్నల్లో ఎస్ఎంసీ ఎన్నికలు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన స్కూల్ కమిటీ ఎన్నికలు అధికార పార్టీ దౌర్జన్యాలతో ముగిశాయి. 68 పాఠశాలలో నూతన కమిటీలను ఎన్నుకోగా, కుర్నూతల గ్రామం దియ్యాలవాండ్లపల్లె ప్రాథమిక పాఠశాల ఎన్నిక వాయిదా పడినట్లు ఎంఈఓలు చక్రేనాయక్, వెంకట సుబ్బయ్యలు తెలిపారు. చాలా గ్రామాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, ఆదర్శ, బాలయోగి గురుకులం, కస్తూర్బా గాంధీ పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి అధికార పార్టీకి మొగ్గు చూపకపోతే పోలీసులతో కేసులు బానాయిస్తామని బెదిరిస్తూ అధికారపార్టీ వైపు వంతపాడారు. దీంతో చాలా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధికార పార్టీ దాహానికి బలై, భయభ్రాంతులకు గురై దాదాపు అన్ని పాఠశాలల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్‌లను వారే ఏర్పాటు చేసుకున్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు విస్మయానికి గురయ్యారు.

## క్లుప్తంగా

### 13న మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 13వ తేదీన జరుగనున్నట్టు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 13వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన సభ జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని చెప్పారు.

### బుద్ధదేవ్ మృతిపై సంతాపం

రాయచోటి అర్బన్ : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య మృతిపై సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి పోతగాళ్ల శ్రీనివాసులు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. 11 సంవత్సరాలపాటు ఆయన పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసినప్పటికీ ఆయన సాధారణ జీవితమే గడిపారన్నారు. పార్టీ పట్ల ఆయనకున్న అంకితభావం, ఆదర్శం, ముందు చూపును సీపీఎం కార్యకర్తలు, నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

### థియేటర్ల యజమానులకు హెచ్చరిక

రాజంపేట : పట్టణంలోని సినీ థియేటర్ల యాజమాన్యాలు మున్సిపాలిటీ చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పేరిట మేనేజర్ శేషఫణి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీకి గత 6 సంవత్సరాల నుంచి అడ్వర్టయిజ్‌మెంట్ ఫీజులు, పార్కింగ్ తదితర ఫీజులు థియేటర్ల యాజమాన్యాలు కట్టడంలేదన్నారు. అలానే సినిమా థియేటర్ల నిర్వహణపై పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా పలు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకు థియేటర్లలో వసూలు చేయాల్సి ఉంటుందని, అలా కాకుండా ఇష్టానుసారంగా వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట హోమాలు



ప్రతిష్ట విగ్రహాలకు పూజలు నిర్వహించిన దృశ్యం

పెనగలూరు : కొత్తపల్లెలో నూతనంగా నిర్మించిన వినాయక స్వామి ఆలయంలో మూడురోజులుగా విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతున్నాయి. గురువారం వేదపండితులు యాగాలు నిర్వహించారు. 101 దీపాలతో వినాయక ప్రతిమను ప్రత్యేక ఆకర్షణగా చేశారు. వినాయకుడికి కలశపూజ 11 మంది వేదపండితులు గ్రామపురోహితుడు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను తలమంచి రమణారెడ్డి దంపతులు సహకారం అందించారు. ఆలయంలో ప్రతిష్ఠించనున్న రాతి విగ్రహాలకు వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు.

### స్వచ్ఛభారత్‌లో పాత్రికేయులు



స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాత్రికేయులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరాముడి ఆలయ వెనుక భాగంలో మాజీ పాత్రికేయులు, పురోహితులు వై.మధుసూదన్ ఆధ్వర్యంలో గురువారం మండల పాత్రికేయులు స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాత్రికేయులు బాలరాజు శివ రాజు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

### పొగాకుతో క్యాన్సర్ వచ్చేది ఖాయం



రాజంపేట టౌన్: ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపల్ పురుషోత్తం, అధ్యాపకులు

రాజంపేట టౌన్ : పొగాకు వల్ల మనిషికి క్యాన్సర్ వచ్చేది ఖాయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. ఎన్ఎస్ఎస్, జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్‌లో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పొగాకు వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. చెడు అలవాట్లు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. యువత పొగాకు దూరంగా ఉండాలన్నారు.

### అన్నదానం

రాయచోటి అర్బన్ : అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పదని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. గురువారం లయన్స్‌క్లబ్ సభ్యులు లోకనాథరెడ్డి ఆర్థిక సౌజన్యంతో పట్టణంలోని భవిత కేంద్రంలోని పిల్లలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ ఛైర్మన్ మహమ్మద్, ఇందాద్ అహమ్మద్, పవన్ కుమార్ నాయుడు, వినోద్‌కుమార్ నాయక్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు



రైతులకు సూచనలు చేస్తున్న అధికారి జయరాణి

లక్కిరెడ్డిపల్లి : సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు జయరాణి తెలిపారు. గురువారం గంగనపల్లి గ్రామంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మాట్లాడుతూ పంటలలో చీడపీడల నివారణకు కేవలం రసాయనిక పురుగు మందులే కాక పసుపు, తెలుగు, జిగురు పల్లాలు నీమాస్త్రం, అగ్నాస్త్రం, బ్రహ్మాస్త్రం మొదలగు జీవ సంబంధిత కీటక నాశనాలను ఉపయోగిస్తూ సమగ్ర సస్యరక్షణ విధానంలో ముందుకెళితే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. రైతులు సమగ్ర సస్యరక్షణ విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. సమగ్ర సస్యరక్షణ విధానాల ద్వారా వచ్చే లాభాలను తెలియజేశారు. వ్యవసాయ సిబ్బంది తప్పక ఈ విధానాన్ని రైతాంగానికి చేరువచేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది, గ్రామ రైతాంగం తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



రైల్వేకోడూరు అర్బన్: మాట్లాడుతున్న శంకరయ్య

రైల్వేకోడూరు అర్బన్ : విద్యార్థుల జీవితాలలో మాదకద్రవ్యాలు తీవ్ర ప్రభావాన్ని చూపించి జీవితాన్ని, భవిష్యత్‌ను నాశనం చేస్తాయని సీనియర్ న్యాయవాది శంకరయ్య గురువారం పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో జరిగిన మండల లీగల్‌సెల్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన మాదక ద్రవ్యాల వాడకం వాటివల్ల యువత జీవితాలపై ప్రభావం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల జోలికి యువత వెళ్లకూడదన్నారు. వాటివల్ల జీవితాలు నాశనం అవ్వడమేకాక, చట్టపరంగా శిక్షలు అనుభవించాల్సి ఉంటుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై అవగాహన



పెనగలూరు: స.హ.చట్టంపై వివరిస్తున్న సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు

పెనగలూరు : సమాచార హక్కు చట్టంపై గురువారం సహాయ వ్యవసాయ సంచాలకులు రమేష్ బాబు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ముఖ్య ఉద్దేశం, పౌర సమాచార అధికారి విధులను వివరించారు. సమాచార హక్కు చట్టంపై దరఖాస్తు చేసుకున్న వారికి కాల పరిమితి గురించి, నిబంధనలు గురించి తెలియజేశారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇంద్రాణి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏఓ పవన్ కుమార్, ఏఎస్ఓ దామోదర్, హెచ్ఈఓ పూర్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు



రాయచోటి టౌన్: నాగదేవతకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో నాగుల చవితి పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఆలయంలోని ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో నాగచతుర్థి సందర్భంగా నాగుల పుట్ట వద్ద ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, వేదపండితులు రాచరాయ యోగిస్వామి వారి ఆధ్వర్యంలో పుట్టకు పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు.


**నేడు నాగపంచమి వేడుక**

పుల్లంపేట : నేడు శుక్రవారం పుల్లంపేట మండలంలోని సీతారాంపేట గ్రామంలో నాగపంచమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు దేవాదాయశాఖ కమిటీ సభ్యులు తెలిపారు. గత 40 సంవత్సరాలుగా గ్రామంలో మహిళలు అమ్మవారికి పూజలు నిర్వహించడం ఆనవాయితీగా జరుగుతోంది. ఉదయం ప్రత్యేక పూజలనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

**ఘనంగా నాగుల చవితి**

రామాపురం : నాగుల చవితి వేడుకలు ప్రజలు అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. శ్రావణమాసం ప్రారంభంలో వచ్చే చవితి రోజున నాగుల చవితి వేడుకలను చేసుకోవడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గురువారం నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు.

# కె.రామాపురం ఎస్ఎంసీ ఎన్నికను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సాయికుమార్

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని కె.రామాపురం చౌడమ్మ గుడి వద్ద ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలను రద్దు చేయాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయానికి ముందు బయట వ్యక్తుల చొరవతో కమిటీని ఎన్నుకున్నారని తెలిపారు. కె.రామాపురం ఎస్ఎంసీ ఎన్నికలను రద్దుచేసి నూతన కమిటీని ఎన్నుకోవాలని లేని పక్షంలో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ నాయకులు ఉపేంద్ర, అంజి, శివతేజ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ఎస్ఎంసీ ఎన్నికలు



సంబేపల్లె: ఓటింగ్ ప్రక్రియలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఓబులవారిపల్లె: తల్లంవారిపల్లెలో ఎన్నికైన ఎస్ఎంసీ నూతన కమిటీ సభ్యులు

సంబేపల్లె : పాఠశాలల అభివృద్ధికి ఎస్ఎంసీలు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు సంపూర్ణ సహకారం అందిస్తే పాఠశాల అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కాగా మండల వ్యాప్తంగా ఉన్న 75 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. అనంతరం రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పాఠశాల కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకున్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని 89 ప్రభుత్వ పాఠశాలలకు స్కూల్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నిక గురువారం సజావుగా జరిగింది. మొత్తానికి అన్ని పాఠశాలలకు ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఎంఈఓ రామయ్య, సీఐ బాబు, ఎస్ఐ నాయక్‌లు ఎటువంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

రామాపురం : మండలంలోని 59 ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ కమిటీ ఎన్నికల్లో 56 పాఠశాలలో ఏకగ్రీవంగా కమిటీ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు మండల విద్యాశాఖాధికారి రామకృష్ణుడు తెలిపారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో తల్లిదండ్రుల పాఠశాల కమిటీ ఎన్నికలపై ఏకాభిప్రాయం రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

చిట్వేలి : మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు మండల విద్యాధికారులు కోదండనాయుడు, ఈశ్వరయ్యలు గురువారం తెలియజేశారు. మండలంలోని 58 ప్రాథమిక, ఐదు ఉన్నత పాఠశాలలు, 1 కేజీబీవీ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగినట్లు వారు తెలియజేశారు.

సిద్దవటం : మండలంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ విలియంరాజు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ సిద్దవటం మండలంలో మొత్తం 49 పాఠశాలలకు గాను 30 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవం కాగా 19 పాఠశాలల్లో పోటీ జరిగిందన్నారు. అనంతరం ఎన్నికైన వారి చేత ఉపాధ్యాయులు ప్రమాణ స్వీకారం చేయించారు.

రాజంపేట టౌన్ : మండలంలో గురువారం జరిగిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 87 ప్రాథమిక పాఠశాలలు, 8 ప్రాథమికోన్నత పాఠశాలలు, 13 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 66 ప్రాథమిక పాఠశాలల్లో, మూడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో, 8 ఉన్నత పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగినట్లు ఎంఈఓ-1 రఘునాథరాజు తెలిపారు. మిగిలిన 31 పాఠశాలల్లో ఎన్నికలు జరగగా ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ఎంఈఓ తెలిపారు.

ఓబులవారిపల్లె : ప్రభుత్వ పాఠశాలల మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహణ గురువారం ముగిసినట్లు ఎంఈఓ రెడ్డయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా 76 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. అన్ని పాఠశాలల్లో కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. తల్లెంవారిపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు షాహిదుల్లా ఆధ్వర్యంలో మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికను నిర్వహించారు. పాఠశాల కమిటీ చైర్మన్ పి.లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా బి.దేవిని ఎన్నుకున్నారు.

నందలూరు : మండలంలోని 55 పాఠశాలల్లో పాఠశాల విద్యా కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందలూరు ఉర్దూ ఉన్నత పాఠశాలలో మాత్రమే పోటీ జరిగింది. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

పుల్లంపేట : మండల వ్యాప్తంగా గురువారం స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించారు. అన్ని పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. అనంతరం కమిటీ సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వీరబల్లి : మండలంలో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని 75 పాఠశాలల్లో ఎన్నికలు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి.

ఒంటిమిట్ట : మండలంలోని 49 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కమిటీ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న 49 ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యా కమిటీ ఎన్నికలు అన్నీ ఏకగ్రీవం అయ్యాయన్నారు. ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డ కోర్ సభ్యులకు, చైర్మన్, వైస్ చైర్మన్‌లకు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

సుండుపల్లె : మండల వ్యాప్తంగా పాఠశాల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా.. ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాశాఖాధికారి రవీంద్ర నాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా 89 పాఠశాలలకు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు అధికారుల సమక్షంలో జరిగాయి. ఎస్ఐ హుస్సేన్ బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

పెనగలూరు: మండలంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. 66 పాఠశాలలకు గాను 61 పాఠశాలలకు ఏకగ్రీవంగా చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎంపిక చేసినట్లు ఎంఈఓ గిరివరదయ్య తెలిపారు. కాగా 5 పాఠశాలల ఎన్నికలు వాయిదా పడ్డాయి.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరనంలో ముగిసినట్లు ఎంఈఓ శివానాయక్ తెలిపారు. మండల వ్యాప్తంగా మొత్తం 60 పాఠశాలలు ఉండగా 52 పాఠశాలల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 8 పాఠశాలలకు ఎన్నికలు జరిపి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు ఎంఈఓ తెలిపారు.

గాలివీడు : మండలవ్యాప్తంగా గురువారం జరిగిన స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు మండల విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని మొత్తం 82 పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు సజావుగా జరిగాయన్నారు. ఎస్ఐ వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో శాంతి భద్రతలను పర్యవేక్షించారన్నారు.



రాజంపేట టౌన్: తుమ్మల అగ్రహారంలో చేతులెత్తి మద్దతు తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



రైల్వేకోడూరు అర్బన్: హెచ్ఎంఎం స్కూల్ వద్ద ఎన్నికలను పర్యవేక్షిస్తున్న పోలీసులు



గాలివీడు: ఎస్ఎంసీ ఎన్నికలను నిర్వహిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

### జల్‌జీవన్ మిషన్ సర్వే పూర్తి చేయండి

రైల్వేకోడూరు అర్బన్ : మండల వ్యాప్తంగా జల్‌జీవన్ సర్వే 9వ తేదీ నుంచి 13 తేదీలోపు అన్ని గ్రామాలలో పూర్తి చేయాలని గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎం.మహేశ్వరరావు తెలిపారు. స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో అన్ని గ్రామాల సచివాలయాల సిబ్బందితో సమావేశమై తగిన ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద పరిశీలించి తాగునీటి కొళాయి ఉందాలేదా, నీరు సరిపోతోందా, ఇంకా తాగునీరు ఇవ్వాల్సిన ఇండ్లు ఎన్ని అన్న విషయంపై సమగ్ర సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.